ప్రజాశక్తి

బుధవారం 8 జనవరి 2025

8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేష్

ఐటిఐలు, పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి

మార్కెట్ లింకేజీ అవసరం

● సుజ్లాన్‌తో ఒప్పందం ఖరారు ● పాలిటెక్ ఫెస్ట్‌లో మంత్రి లోకేష్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలోని ఐటిఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు ఉత్తమంగా ఉండాలని, ఇందుకు మార్కెట్ లింకేజీ చాలా అవసరమని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. నగరంలోని ఎస్‌ఎస్ కన్వెన్షన్లో జరుగుతున్న పాలీటెక్ ఫెస్ట్ (2024-25)లో మంత్రి లోకేష్ మంగళవారం పాల్గొన్నారు. విద్యార్థుల టెక్ ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను తెలుసుకొని వారిని ప్రోత్సహించారు. ఆయా ప్రాజెక్టుల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ మార్కెట్ లింకేజి కోసం దేశంలో అతిపెద్ద విండ్మిల్ మ్యానుఫ్యాక్చరర్ సుజ్లాన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. పాఠ్యాంశాల ప్రణాళికతోపాటు భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణలకు అవకాశం కల్పించే ఆలోచనతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. ఇలా మేకిన్ ఇండియా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ ఉందన్నారు. అందుకు తగినట్లుగానే విద్యార్థుల ఆలోచనలకు వాస్తవ రూపమిచ్చే ఫ్యాకల్టీ కూడా ఉందన్నారు. దాదాపు 1,256 ప్రాజెక్టుల్లో 249 టాప్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి టెక్‌ఫెస్ట్‌లో ప్రదర్శించినట్లు చెప్పారు. గ్రామాల్లోనూ ఉన్నత ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. "రాజధాని ఒకేచోట ఉండాలి, అభివద్ధి వికేంద్రీకరణ జరగాలి.. ఒక ఎకోసిస్టమ్ ఏర్పడాలి" అనేది ప్రభుత్వ విధానమన్నారు. అందుకే వెనుకబడిన అనంతపురం జిల్లాకు కియా మోటార్స్‌ను తీసుకొచ్చామన్నారు. కర్నూల్‌ను డ్రోన్‌హబ్‌గా అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. ప్రకాశం జిల్లాలో బయో ఫ్యూయల్స్ తయారీకి రిలయన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ద్వారా ప్రతి పెద్ద జిల్లాలో నోడ్స్ ఏర్పాటుచేసి మంచి ఆలోచనలున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో కనీసం ఒక్క యూనీకార్న్ కంపెనీ రాష్ట్రానికి రావాలనే

(మిగతా 2లో)



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేరళ మాజీ మంత్రి ఎం.ఎ.బేబి

రాజ్యాంగ పరిరక్షణపై ఉద్యమానికి సన్నద్ధం

పుస్తక మహోత్సవంలో కేరళ మాజీ మంత్రి ఎం.ఎ.బేబి

ఇసుక దోపిడీ !

యథేచ్ఛగా అక్రమ రవాణా

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్టీఆర్ జిల్లాలో ఇసుక అక్రమ దోపిడీ యధేచ్ఛగా సాగుతోంది. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, వారి అనుచరుల ద్వారా కష్ణానది, మునేరులో ఇసుక దోపిడీకి పాల్పడుతూ కోట్లాది రూపాయలు పోగేసుకుంటున్నారని ఆ పార్టీ కార్యకర్తలే ఆరోపిస్తున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో పెండ్యాల, ఏటూరు ఇసుక ర్యాంపులు మినహా, వేములపల్లి, కాసరబాద, పొక్కునూరు, ఉస్తేపల్లి, జగ్గయ్యపేట పరిధిలో శనగపాడు, లింగాల, అనిగండ్లపాడు, అనుమంచిపల్లి తదితర ర్యాంపులు జిల్లాకు చెందిన అధికార పార్టీ కీలక ప్రజా ప్రతినిధి అనుచరులు నడుపుతున్నారు. ఈ ర్యాంపుల నుండి ప్రతిరోజు హైదరాబాద్‌కు రాత్రి సమయాల్లో ఓవర్ లోడుతో వందలాది లారీల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇటీవల చిల్లకల్లు పోలీసులు హైదరాబాద్ వెళ్లే ఇసుక లారీలను పట్టుకున్న సంఘటనే దీనికి నిదర్శనం. టిడిపి ప్రజా ప్రతినిధి అనుచరులు కాకుండా ఇతరులు ఎవరైనా రీచ్‌లను దక్కించుకుంటే, ఆ గుత్తేదారుడిని బెదిరించి, ఆ ర్యాంపులను కూడా టిడిపి నేతలే దక్కించుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇదిలా ఉండగా కంచికచర్ల మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు గుత్తేదారును బయటకు గెంటేసి జిల్లా ప్రజా ప్రతినిధి అనుచరులు ఆ ర్యాంను నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. టిడిపి ప్రజాప్రతినిధి వేధింపులు తట్టుకోలేకి పెండ్యాల రీచ్ గుత్తేదారుడు ఆ రీచ్ నిర్వహణకు నుండి తప్పుకున్నట్లు తెలిసింది. తాను ప్రభుత్వానికి కట్టిన డిపాజిట్ సొమ్ము తిరిగి వచ్చిన తర్వాత రీచ్ పాటను వదిలేస్తానని చెప్పినట్లు, ప్రస్తుతం బాధ్యతల నుండి తప్పుకున్నట్లు సమాచారం. సదరు గుత్తేదారు డిపాజిట్ రాదేమోనని భయంతో నిశ్శబ్దంగా ఉంటే జిల్లా ప్రజా ప్రతినిధి అనుచరులు రాంపులో వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆదివారం పెండ్యాల ఇసుక ర్యాంపులో నాలుగు ఇసుక లోడుతో ఉన్న టిప్పర్లు రెండు జెసిబిలు పట్టుకుంటే ఇంతవరకు వాటిని ఎందుకు సీజ్ చేయలేదనే ప్రశ్న తలెత్తుతోంది.



వార్తలు 6వ పేజీలో

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్ మహ్మద్‌పేటలో విద్యుత్ భారాలపై సిపిఎం ఆధ్వర్యాన రోడ్డుపై నిరసన తెలుపుతున్న ప్రజలు

విద్యుత్ భారాలపై నిరసన సెగ

సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల ఆందోళనలు

నేటి నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రారంభించనున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మొగల్రాజపురం ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 8 నుండి 14వ తేదీ వరకు ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుంది. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సహకారంతో వీవర్స్ సర్వీస్ సెంటర్ వారు ఈ వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు చేనేత, జౌళి పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. దేశవ్యాప్తంగా 40 నుండి 50 వరకు గల వివిద రకాల నేత కార్మికులు, చేనేత సంస్థలు వారి విభిన్న చేనేత ఉత్పత్తులను పరిచయం చేయడానికి ఈ ప్రదర్శనలో పాల్గొననున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని చేనేత అండ్ జౌళి, బిసి అండ్ ఇడబ్ల్యుఎస్ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రారంభించనున్నారు. వీరితోపాటు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, విజయవాడ రాజ్యసభ సభ్యులు కేశినేని శివనాథ్ ఇతర ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొననున్నారని తెలిపారు.

బియ్యం మాయం కేసులో


ముగ్గురు నిందితుల విచారణ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) సతీమణి జయసుధకు చెందిన గోడౌన్లో పౌరసరఫరాల సంస్థకు చెందిన రేషన్ బియ్యం మాయమైన కేసులో ముగ్గురు నిందితులను మంగళవారం పోలీసులు విచారించారు. బందరు సబ్‌జైల్ రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులు మానసతేజ, ఆంజనేయులు, మంగారావులను ఉదయం 10 గంటలకు పోలీసులు తమ కస్టడీకి తీసుకున్నారు. అనంతరం తాలూకా స్టేషన్‌కు తరలించారు. అక్కడ సాయంత్రం ఐదు గంటల వరకు విచారించారు. అనంతరం న్యాయమూర్తి ముందు హాజరుపరిచి తిరిగి సబ్‌జైల్‌కు తరలించారు. బియ్యం మాయమైన కేసులో ఏ వన్‌గా ఉన్న మాజీ మంత్రి పేర్ని సతీమణి జయసుధను పోలీసులు విచారించారు. దీని ఆధారంగా నిందితులపై ప్రశ్నలు సంధించి వివరాలు రాబట్టినట్లు తెలిసింది. గోడౌన్ నుంచి బియ్యం తరలింపు, నిందితుల ముగ్గురి మధ్య జరిగిన బ్యాంకు లావాదేవీల గురించి పోలీసులు కూపీ లాగినట్లు సమాచారం.

'గ్రీన్‌కో ఎనర్జీ'లో తెలంగాణా ఎసిబి సోదాలు

మచిలీపట్నం కలెక్టర్ బంగ్లా సమీపంలోని గ్రీన్‌కో ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ కార్యాలయంలో తెలంగాణా ఎసిబి అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు హైదారాబాద్ నుంచి తొమ్మిది మంది ఎసిబి బృందం మచిలీపట్నంలోని కార్యాలయానికి వచ్చింది. సెర్చి వారెంట్ చూపి లోపలికి వెళ్లారు. రాత్రి ఎనిమిది గంటల వరకు సోదాలు నిర్వహించారు. సోదాలు ముగిసేవరకు ఎవరినీ లోనికి, లోని వారిని బయటకు అనుమతించలేదు. సోదాలు ముగిసిన తర్వాత వెళ్లిపోయారు. గ్రీన్‌కో ఎజిఎం సురేష్ దీనిపై మీడియాతో మాట్లాడుతూ బందరులోని సంస్థ కార్యాలయాన్ని గెస్ట్‌హౌస్‌గా ఉపయోగించుకుంటున్నట్లు ఎసిబి అధికారులకు తెలిపామని పేర్కొన్నారు. ఎసిబి అధికారులు కోరిన విధంగా ఇంటి పన్ను, కరెంటు బిల్లులను అందించామని తెలిపారు.



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న నేతలు శివారెడ్డి తదితరులు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఎపిఎన్‌జిఒ నేతలు శివారెడ్డి, విద్యాసాగర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ కార్మిక వర్గాలు, పెన్షనర్లు ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితులను చక్కదిద్దేందుకు ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర సంఘం చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహిస్తుందని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అలపర్తి విద్యాసాగర్‌కు ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో ఆత్మీయ సత్కారాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కేవీ శివారెడ్డి మాట్లాడుతూ విద్యాసాగర్ వంటి వ్యక్తులు రాష్ట్రస్థాయి పదవులలో ఉండటం ఏపీఎన్జీజీవోలో ఉన్న ప్రతిఒక్కరికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సన్మాన గ్రహీత ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ పెన్షనర్ల ఆకాంక్షలు నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కషిచేస్తానన్నారు. డీఏ, హెల్త్ కార్డు, ఏపీజిఎల్ఐ, జీపీఎఫ్ వంటి అంశాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలను కోరినట్లు వివరించారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షులు డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన అత్యవసరమైన అంశాలు వేగంగా పరిష్కారం అవుతాయని పెన్షన్లు భావిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర మాజీ అధ్యక్షులు బీవీ సుబ్బయ్య, ఉపాధ్యక్షులు అబ్దుల్ కరీం, ఎన్టీఆర్ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.దాలినాయుడు, నారాయణరావు, జి. ప్రభుదాసు, బి.విష్ణువర్ధన్ రావు, ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర కోశాధికారి రంగారావు, మహిళా ప్రతినిధి రాజ్యలక్ష్మి, జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణరెడ్డి, సిటీ అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పెన్షనర్ల అసోసియేషన్ల అధ్యక్ష కార్యదర్శులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



విఎంసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఎపిఎంఇఎస్ఎ విఎంసి యూనిట్ అధ్యక్షులు శ్యామ్ సుందర బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు మంగళవారం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. విఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో కలిసి ఎపిఎంఇఎస్ఎ విఎంసి యూనిట్ క్యాలెండర్‌ను కమిషనర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ విఎంసి ఉద్యోగులు ఉద్యోన్నతి లేకుండా ఒకే క్యాడర్లో పనిచేస్తున్నారని, వారికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమములో ఎపి మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.శివరామ ప్రసాద్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.శ్రీకష్ణ దేవరాయలు, విఎంసి యూనిట్ జనరల్ సెక్రటరీ సలీం అహ్మద్, ఉపాధ్యక్షులు ఎస్‌కె రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ గుర్రం ప్రకాష్ సాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలు, పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి మార్కెట్ లింకేజి అవసరం

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్షను మంత్రి వ్యక్తం చేశారు. ఈ దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులకు లోకేష్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఎల్‌సి పరుచూరి అశోక్ బాబు, ఎంఎల్ఎ గద్దె రామమోహనరావు, పాఠశాల, కళాశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు జి.గణేష్ కుమార్, సాంకేతిక శాఖ అధికారులు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

కలెక్టర్ జి.లక్ష్మీశ



ప్రజాశక్తి - విజయవాడ : బాల్య వివాహ రహిత భారత్ కోసం ప్రతిఒక్కరూ కషి చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన బాల్య వివాహ రహిత భారత్ (బాల్య వివాహ ముక్త్ భారత్) ప్రచార కార్యక్రమం అమల్లో భాగంగా బాల్య వివాహాల నిషేధ అధికారుల (సీఎంపీవో)తో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రయత్నించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులకూ అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు చేసిన చట్టాలు, ప్రవేశపెట్టిన కార్యక్రమాలు, విధానాల పటిష్ట అమల్లో మహిళాభివద్ధి, విద్య, వైద్య ఆరోగ్యం, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. బాలికల విద్య, ఆర్థిక సాధికారతపై దృష్టిసారించాలన్నారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో నోడల్ అధికారి సీహెచ్ సాయిగీత, వాసవ్య మహిళామండలి ప్రెసిడెంట్ డా. కీర్తి బొల్లినేని, విజయవాడ రూరల్ సీడీపీవో జి.మంగమ్మ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.రాజరాజేశ్వరరావు పాల్గొన్నారు.

అఘోరి హల్‌చల్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామ సమీపంలోని జిఎంఆర్ టోల్‌గేట్ వద్ద మంగళవారం అఘోరి హల్‌చల్ చేసింది. హైదరాబాద్ నుండి విజయవాడ వస్తూ జిఎంఆర్ టోల్ గేట్ వద్ద కారు దిగిన అఘోరిని జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. ఒక్కసారిగా కారు దిగటంతో ఎక్కడికి వెళుతున్నారు, కారు ఎందుకు దిగారని పోలీసులు ప్రశ్నించారు. దీంతో అఘోరి పోలీసులతో వాగ్వివాదానికి దిగింది. అనంతరం పోలీసులు ఆమెను కారులో విజయవాడ వైపు పంపారు.

రోడ్డు నిర్మించాలని సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి-కోడూరు, అవనిగడ్డ

కోడూరు-అవనిగడ్డ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కోడూరు నుండి అవనిగడ్డకు మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కోడూరు అవనిగడ్డ రోడ్డు నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ రహదారి కాంట్రాక్టర్కు గత ప్రభుత్వం రూ ఆరు కోట్ల బకాయిలు పెట్టినట్లు తెలిపారు. ఆర్అండ్బి డిఈ రమేష్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం కొనసాగించాలని ఇప్పటికే కాంట్రాక్టర్కు



అవనిగడ్డలో ఎంఎల్ బుద్ధప్రసాద్కు వినతి

నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. కోడూరులో పాదయాత్ర ప్రారంభం సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్రాంతి నాటికల్లా రాష్ట్రంలో రహదారులన్నీ మరమ్మతులు చేపట్టాలని ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు సిఎం సైతం అవనిగడ్డలో జరిగిన బహిరంగ సభలో చెప్పి నిధులు కేటాయించలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు పనులు చేపట్టి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పనులు నిలిపివేశారని తెలిపారు. దీని వల్ల ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న హంసలదీవి వేణుగోపాలస్వామి వారి ఆలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నప్పటికీ రహదారి సమస్య పరిష్కరించలేదని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలసౌరి



కోడూరులో ప్రారంభమైన పాదయాత్ర

స్పందించి రహదారి నిర్మాణం వెంటనే చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు శీలం నారాయణరావు, యద్దనపూడి మధు, ఘంటసాల కార్యదర్శి వాక రామచంద్రరావు మోపిదేవి బండి ఆదిశేషు, కోడూరు కార్యదర్శి మోహన్‌రావు, నాయకులు షేక్ కరిముల్లా, బత్తిన రాజగోపాల్, శివ సాయి కొప్పనాతి తాతయ్య, మేడంకి వెంకటేశ్వరరావు, బెజవాడ నాగేశ్వరరావు, దిడ్ల వెంకటేశ్వరరావుఆవుల బసవయ్య, రేపల్లె యోగ ప్రకాష్ పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి : ఏఓ

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండలంలో రబీ పంటగా మినుము ఎక్కువగా సాగు చేస్తున్నందున రైతులు సకాలంలో తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో కె.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దేవరకోట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంట



పొలాలను పరిశీలించిన ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. విత్తనాలు చల్లిన 21-23 రోజులలోపు కలుపు యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా పంటకు చీడపీడల ఉధృతి అదుపులో ఉంటుందన్నారు. వెడల్పాకు జాతి కలుపు మొక్కలు, బంగారు తీగ కలుపు ఆస్కారం ఉన్న పొలాల్లో ఇమాజితాపిర్ 200 మిల్లీలీటర్లను 200 లీటర్ల నీటిలో ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. బంగారు తీగ కలుపు కనిపించిన వెంటనే మినుము మొక్కతో సహా పెకిలించి తగలబెట్టాలన్నారు. మండలంలోని 21 రెవెన్యూ గ్రామాలలో రబీ 2024-25 పంట కాలమునకు ఈ-క్రాప్ బుకింగ్ చేయటానికి వివిఏలకు తగిన శిక్షణ సూచనలు ఇవ్వటం జరిగిందన్నారు. పంటల వివరాల నమోదుకు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకోట సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, వివిఏ బి.సత్యదేవ్, రైతులు పాల్గొన్నారు.

రీసర్వేపై గ్రామ సభ

ప్రజాశక్తి-ఉయ్యూరు: ప్రభుత్వం ప్రారంభించిన రీసర్వే ప్రాజెక్ట్ భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం సురేష్ కుమార్ అన్నారు. రీ సర్వే ప్రాజెక్టు జబర్లపూడిలో మం గళవారం గ్రామసభ నిర్వహించి రీసర్వే వల్ల ప్రయోజనాలు తహసీల్దార్ తెలియచేశా రు. సర్వేచేసే సమయంలో రైతు లేదా వారి ప్రతినిధి తప్పనిసరిగా ఉండాలన్నారు. సర్పంచ్ శేషవరప్రసాద్, సర్వేయర్ డి సురేష్, డీటీ వెంకటేశ్వరరావు, ఆరి యతేంద్రియులు పాల్గొన్నారు.

12న కాటూరులో ఆవుల అందాల పోటీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కాటూరు గ్రామ తెలుగు యువత ఆధ్వర్యంలో ఈనెల 12న ఆవుల అందాల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు కొడె హరీశ్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గోమాతను పూజించడం హిందూ సంప్రదాయంగా వస్తుందన్నారు. పోటీల్లో పాల్గొన్న ఆవులకు ప్రథమ బహుమతిగా రూ.25,116, ద్వితీయ బహుమతి రూ.10,116, తృతీయ బహుమతి రూ.5,116 అందచేస్తామని, వివరాలకు 8143783253 నెంబరుకు సంప్రదించాలని అన్నారు.

సురేష్‌బాబుకు ఉత్తమ సమాజ సేవ అవార్డు

ప్రజాశక్తి-కంకిపాడు: కమ్మ సేవ సంఘం గ్రేటర్ విజయవాడ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సమాజ సేవ అవార్డును రావి సురేష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో ఘనంగా సత్కరించి అవార్డును బహూకరించారు. ఈ కార్యక్రమంలో బొర్రా గాంధీ, కీలారు ఫణి, గుమ్మడి రామకృష్ణ, ఎస్‌వి కృష్ణారావు, ముత్తవరపు శివరామకృష్ణ, తోటకూర శ్రీనివాసరావు, చెన్నుపాటి ఉషారాణి, అట్లూరి సుమబిందు, లింగనేని శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్న నినాదంతో తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని గత 25 ఏళ్లగా సమాజ శ్రేయస్సుకై 125 ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు రావి సురేష్ బాబు. ప్రకృతిని కాపాడుకోవాలనే ధ్యేయంతో ఐదు వేలకు పైగా మొక్కలను నాటించారు. గడిచిన 25 ఏళ్లలో



అవార్డు అందుకుంటున్న సురేష్‌బాబు

ఎంతో మందికి అన్నదానం చేశారు. పేద వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం, విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇప్పించడంలో కృషి చేశారు. నేత్ర సమస్యలు ఉన్నవారికి కళ్లజోళ్లు, మందుల పంపిణీ, శస్త్ర చికిత్స ప్రముఖ కంటి ఆసుపత్రుల సహకారంతో నిర్వహించారు.

వృద్ధుల పట్ల నిర్లక్ష్యం తగదు : వనజాక్షి

ప్రజాశక్తి-చల్లపల్లి: వృద్ధాప్యం శాపం కానీయకుండా వృద్ధులపై ప్రతి ఒక్కరూ కరుణ చూపించాలని తహశీల్దార్ డి. వనజాక్షి అన్నారు. స్థానిక తాహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి మంగళవారం సీనియర్ సిటిజన్స్ సమావేశ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామ స్థాయిలో వృద్ధుల వివరాలను తీసుకొని , వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాచారాన్ని సేకరించాలని మహిళా పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి ఎ. వెంకటరమణ, ఎస్సై పి. సుబ్రహ్మణ్యం, మండల పశువైద్యాధికారి మనోజ్ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ శాఖ పరిధిలోని శ్రీ పింగళి వెంకయ్య ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మరియు నర్సింగ్ కళాశాల మచిలీపట్టణం కృష్ణా జిల్లా సంస్థల యందు కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ పద్ధతిన ఖాళీలను భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రకటనలో తెలిపారు. మొత్తం 142 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు https://krishna.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరచిన నోటిఫికేషన్‌లో పేర్కొనబడిన నియమావళి మరియు నిబంధనలు పూర్తిగా చదివిన పిదప ధరకాస్తు లను డౌన్లోడ్ చేసుకుని దరఖాస్తుతో పాటు విద్యార్హతలు మరియు ఉద్యోగ అర్హతలు ఒక జిరాక్స్ కాపి సెట్ ను సెల్ఫ్ అటెస్ట్ చేసి శ్రీ పింగళి వెంకయ్య ప్రభుత్వ వైద్య కళాశాల, మచిలీపట్టణం, జిల్లా కార్యాలయంలో ఈ నెల 16 నుండి 23వ తేదీ ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని తెలిపారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కోడూరు: ఈ నెల 12వ తేదీన సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగుస్తున్నందున ఇంకా ఎవరైనా టిడిపి సభ్యత్వం తీసుకోని వారు ఉంటే తీసుకోవాలని కోడూరు టిడిపి అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం బిబి పేటలో బండే వెంకటేశ్వరరావు, ముళ్లపూడి బసవయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అప్పికట్ల రవీంద్రబాబు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, మహమ్మద్ ఇమ్రాన్, తుంగల శ్రీహరి పాల్గొన్నారు. చల్లపల్లి: కార్యకర్తలకు టిడిపి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని వైస్ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు అన్నారు. మంగళవారం చల్లపల్లి నిమ్మలతోటలో టిడిపి సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోర్ల శివ, నబీఘోరీ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని వృద్ధిలోకి రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, కలెక్టర్ డిఆర్‌ఓ కే చంద్రశేఖరరావు లతో కలిసి మచిలీపట్నం బచ్చుపేట లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం నెంబర్ 4 సందర్శించి, విద్యార్థినీలకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్, స్కేల్, జామెంట్రీ బాక్స్, కొబ్బరి నూనె, ఫేస్ పౌడర్, హెయిర్ పిన్స్, టవల్, నాప్కిన్‌లతో కూడిన కిట్స్ అందజేశారు. హాస్టల్లో ప్రతిరూముకు మస్కిటో రీఫిల్స్ మెషిన్ తో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ ల్ల లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని, పౌష్టికాహారంతో కూడిన మెనూతో భోజనం అందిస్తున్నదని వీటిని సద్వినియోగం చేసుకొని బాగా కష్టపడి చదివి వద్ధిలోకి రావాలని తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించి వారు భవిష్యత్తులో వారి లక్ష్యాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే లక్ష్యాలు నిర్దేశించుకుని లక్ష్యసాధనకు పట్టుదలతో కషి చేయాలని అన్నారు. పాఠ్యపుస్తకాలు చదవడం అలవర్చుకొని విషయ జ్ఞానం పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లోనూ ముద్రిస్తున్నదని, తద్వారా ఇంగ్లీష్ భాష కూడా నేర్చుకోవచ్చని సూచించారు. విద్యార్థినిలలో చాలామంది నర్సింగ్ కోర్సు చేయాలని



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

తమ ఆకాంక్ష వెలిబుచ్చగా, ప్రస్తుతం జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల కోసం ప్రభుత్వం అర్హత కలవారికి శిక్షణ ఇస్తున్నదని, విదేశాల్లో కూడా అవకాశాలు మెండుగా లభిస్తాయి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జన్మదినం పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. తాసిల్దార్ మధుసూదన్ రావు, ఏఎస్‌డబ్ల్యూఓ శీలం రాజశేఖర్ రెడ్డి, హెచ్ డబ్ల్యూఓ సూర్యభేగం పాల్గొన్నారు.

పంట కాల్వల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సాకారంతో పంట కాల్వల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అశ్వరావుపాలెం నీటి సంఘం అధ్యక్షులు దాసిని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అశ్వరావుపాలెం సాగునీటి సంఘం పరిధిలోని సిద్దయ్యకోడు రెండో నెంబర్ పంట కాలువల్లో ఇరిగేషన్ శాఖ నిధులతో తూటుకాడ



నిర్మూలనకు స్ప్రేయింగ్ చేయించారు. అశ్వరావు పాలెం, బంధలాయి చెరువు, గుడివాక వారి పాలెం, ఆయకట్టు రైతులకు మేలు చేసేందుకు ఈ పనులు చేపట్టినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రవితేజ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - విజయవాడ : బట్టల బేల్స్ దొంగతనం చేసిన నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన ఫిర్యాది ఎనిమిది సంవత్సరాలుగా ఆటోనగర్ బస్ టెర్మినల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 19 2024న ఆటో నగర్ నుండి హైదరాబాదు వెళ్ళడానికి బయలుదేరి విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోనికి వచ్చాడు. ఆర్‌టిసి కార్గో పార్సిల్ కౌంటర్‌లో హైదరాబాదుకు తీసుకువెళ్లాల్సిన స్టాక్ వేసుకుని పాసింజర్లను ఎక్కించుకుని హైదరాబాద్ వెళుతున్న సమయంలో బస్టాండ్ బయట కొందరు బస్ ఆపి ఎక్కారు. ఆ సమయంలో వారి లగేజ్ వెనుక డిక్కీలో పెడుతున్న సమయంలో పార్సిల్ కౌంటర్‌లో వేసుకున్న స్టాక్‌లోని రెండు బట్టల బేల్స్ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. 23న కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కృష్ణలంక పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. సిపి ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు, డీసీపీ క్రైమ్స్ కె.తిరుమలేశ్వరరెడ్డి సూచనలతో, క్రైమ్ ఎడిసిపి ఎం.రాజారావు పర్య వేక్షణలో, క్రైమ్ ఎసిపి సిహెచ్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సలాం, కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.వి.నాగరాజు వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. సోమవారం పండిట్ నెహ్రూ బస్టాండ్ ఎరైవల్ బ్లాక్ వద్ద నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని విచారించి వారి వద్దనుండి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. వీరిని తెలంగాణా, మేహబూబాద్ జిల్లా, నరసింహుల పేట ఏరియాకు చెందిన బుక్యా బాలు (35 సం.), హరికష్ణ (22), రమేష్ (35) గుగులోతు కళ్యాణ్ (20) గా గుర్తించారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నందిగామ ఎసిపి తిలక్ ఆధ్వర్యంలో మంగళవారం చిల్లకల్లు టోల్‌గేటు వద్ద జగ్గయ్యపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పహారా కాసి గంజాయి పట్టుకున్నారు. టోల్ గేట్ సమీపంలో పోలీసులు ఉండటంతో విజయవాడ వైపు నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న కారును వెనక్కి తిరిగి మరల విజయవాడ వైపు కారు వేగంగా వెళ్తుండడంతో పోలీసులకు అనుమానం వచ్చి కారును పోలీసులు అనుసరించారు. మండలంలోని గవరవరం గ్రామం వద్ద పొలాల్లో కారును వదిలిపెట్టి దుండగులు పారిపోయారు. కారు డిక్కీ ఓపెన్ చేసి చూడగా గంజాయి ఉందని గుర్తించిన పోలీసులు సుమారుగా 70 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నందిగామ : నందిగామ శివారు విజయవాడ రోడ్డులో గృహాల మధ్య అనుమానాస్పదంగా ఉన్న కారులో భారీగా గంజాయి ప్యాకెట్లను నందిగామ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మూడు నాలుగు గంటల క్రితం గట్టు భీమవరం టోల్ ప్లాజా వద్ద మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ నెంబర్ కారును స్వాధీనం చేసుకుని సుమారు 80 కేజీల గంజాయిని నందిగామ సబ్ డివిజన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నందిగామ శివారు విజయవాడ రోడ్డులో గృహాల మధ్య మరోకారు, అందులో భారీ స్థాయిలో 120 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోవడం సంచలనం రేకెత్తించింది. సమాచారం అందుకున్న నందిగామ ఎసిపి ఎబిజీ తిలక్, నందిగామ పట్టణ సిఐ నాయుడు, నందిగామ ఎంఆర్‌ఓ సురేష్ బాబు, విఆర్‌ఓ లు కారు ఉన్న ప్రదేశానికి చేరుకుని విచారణ చేపట్టారు.

డాన్‌బాస్కో స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని డాన్ బాస్కు స్కూల్ 42 వ వర్సికోత్సవ వేడుకలు గురునానక్ నగర్ లోని పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి.



ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి కష్ణా జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో 42 ఏళ్లుగా విద్యా సంస్థ ను నడపడం గొప్ప విషయమని అన్నారు. చక్కని విద్యను అందించడం కారణంగా ఇక్కడ చదివిన విద్యార్థులు ఎంతో మంది దేశ, విదేశాలలో ఉన్నారని, ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. రానున్న కాలంలో కూడా పాఠశాల మంచి అభివద్ధి సాధించాలని ఫలితాలలో అగ్రగామిగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వి.నారాయణ రావు, కరెస్పాండన్ బి వి ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆరోగ్యపింఛన్ల పున:పరిశీలన

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తోందని, ఈ క్రమంలోనే ఆరోగ్య పెన్షన్లకు సమాన, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన ప్రయోజనాలు అందించాలనే ఉద్దేశంతో పెన్షన్ల ధ్రువీకరణ, పునఃపరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన రూ.15 వేలు పెన్షన్ల (వీల్ ఛెయిర్, బెడ్‌కు పరిమితమైన సివియర్ మస్కులర్ డిస్ట్రోఫీ కేసులు, ప్రమాద బాధితులు) ధ్రువీకరణ, పునఃపరిశీలన ప్రక్రియను మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని సచివాలయం-1 పరిధిలో పరిశీలించారు. హెల్త్ పెన్షన్ లబ్ధిదారు తుకారాం రాజాను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రత్యేక బృందాలతో 358 పెన్షన్ల పున:పరిశీలన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పటిష్ట పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జియో ట్యాగింగ్‌తో పాటు పునఃపరిశీలన వివరాలను డిజిటల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియ చేపట్టేందుకు బృందాలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు ఉన్నారు.

అధ్వానంగా షేక్ రాజా ఆస్పత్రి

50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కొత్తపేటలో గల షేక్ రాజా సాహెబ్ ఆసుపత్రిలో వాటర్ లీకేజీతో చెరువులను తలపించే విధంగా వున్నాయని, వాటిని పరిరక్షించాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. 20 సంవత్సరాల క్రితం నిర్మించిన షేక్ రాజా సాహెబ్ ఆసుప్రత్రిలో చిల్డ్రన్స్ వార్డు భవనం నేడు వైద్య సేవలకు నోచుకోకపోగా, ప్రస్తుతం భవనం పైన వాటర్ ట్యాంక్ లీకేజ్ వల్ల భవనం పూర్తిగా నాచు పట్టి గడ్డి మొలిచి చెరువును తలపిస్తుందన్నారు. ఈ నీరు నిలిచిపోవటం వల్ల భవనం దెబ్బతిని పాడైపోతుందని తెలిపారు. ఈ విషయమై సిపిఎం ప్రతినిధి బృందం 50వ డివిజన్ కార్పొరేటర్, పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సూరిబాబు, ఎన్.బాల గురప్ప, కె.హరిప్రసాద్ మంగళవారం పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్య అధికారి డాక్టర్ బిసి కె.నాయక్‌ని కలిసి ఫిర్యాదు చేశారు. వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు త్వరగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



ఆసుపత్రిని చూస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

మహిళా సమాఖ్య సమావేశం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలోని మండల మహిళా సమైక్య సమావేశం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విఒల పనితీరును గురించి మాట్లాడుతూ అన్ని విఒలలో ప్రతి నెలా రెండు సమావేశాలు నిర్వహించాలని, సభ్యులు చర్చించిన ప్రతి విషయాన్ని, బ్యాంకు రుణాలు గురించి, స్త్రీనిధి రికవరీ, సిఐఎఫ్ రికవరీ, ఉన్నతి రుణాల రికవరీ, తదితర అంశాలు అన్ని విఒఎలు తీర్మానంలో నమోదు చెయ్యాలి అని సూచించారు. తీసుకున్న ప్రతి రుణం సభ్యులు నేరుగా బ్యాంకు కౌంటర్‌లో మాత్రమే చెల్లించి రసీదు పొందాలని, ఎవ్వరూ బిసి పాయింట్‌లలో కట్టొద్దని తెలిపారు. స్త్రీనిధి రికవరీలు పేటియం ద్వారా మాత్రమే చెల్లించాలని, ఎక్కడా నగదు లావాదేవీలు జరపకూడదని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి సంఘానికి బ్యాంకు ఋణాలు 20 లక్షలు అందజేయాలని, విఒఎలకు ఎపిఎం బొలగాని రామకృష్ణ తెలిపారు. స్త్రీనిధి రికవరీలో 100 శాతంతో, మొబైల్ బుక్ కీపింగ్‌లో 100 శాతంతో ఎస్‌హెచ్‌జి గ్రేడింగ్‌లో 87శాతం ఎ.గ్రేడ్‌తో జిల్లాలోనే రెడ్డిగూడెం మొదటి స్థానంలో ఉందన్నారు. పిఎం సూర్య ఘర్‌లో భాగంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానల్‌ను పెట్టుకోవాలని అందుకు గానూ ప్రభుత్వం నుండి సబ్సిడీ పొందవచ్చన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ప్రభుత్వమే ఉచితంగా సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి బోయి కళ్యాణ్ ఇటీవల యాజమాన్యం, అధ్యాపకుల వల్ల అవమానాలకు గురై మనోవేదన చెంది ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. ఈ నేపధ్యంలో బోయి కళ్యాణ్ కుటుంబ సభ్యులను మంగళవారం సితార సెంటర్ వద్ద గల వారి నివాసానికి మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు కలిసి పరామర్శించి, సంతాపం తెలియజేశారు.

సిద్ధార్థలో మేడసాని అవధానం

విజయవాడ : పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగుశాఖ సారథ్యంలో మంగళవారం ఉదయం విజయవాడలోని సిద్ధార్థ కళాశాల వెబినార్ హాలులో డాక్టర్ మేడసాని మోహన్ తన అష్టావధానంతో అందరినీ సమ్మోహనపరిచారు. నిషిద్ధాక్షరి నిర్వహించిన శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్ మాట్లాడుతూ ఇది సిద్ధార్థ కళాశాలతో పాటు మేడసాని మోహన్ అవధాన స్వర్ణోత్సవ సంవత్సరంగా పేర్కొంటూ పొగమంచును కందపద్యంలో వర్ణించాల్సిందిగా కోరగా అవధాని వెంటనే హేలామయకాంక్ష అంటూ శ్రీకారం చుట్టారు. న్యస్తాక్షరి అంశాన్ని నిర్వహించిన విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు సిద్ధార్థుడి బోధనలను చంపకమాలలో చెప్పాల్సిందిగా కోరుతూనే అవధాని ఇంటిపేరులోని ఒక్కో అక్షరం ఒక్కో పాదంలో వచ్చేలా కట్టడి చేయగా జడులనమేయ వాఙ్మయ విశాలురుగా వెలిగించే బుద్ధదేవుడా అంటూ వర్ణించారు అవధాని. అధ్యాపకులు డాక్టర్ జేవీ చలపతిరావు పద్యం, మద్యం, హృద్యం, గద్యం అనే దత్తపది ఇస్తూ శార్దూలంలో భాగవత ప్రాశస్త్యాన్ని చెప్పమనగా పద్యంబుల్ వడి వ్యాసపోతనల వాగ్యాహార విస్ఫూర్తి శ్రీ మద్యం బ్రహ్మల అంటూ దత్తపదిని సమయస్ఫూర్తితో అవధాని పూరించారు. తెలుగు సహాయక ఆచార్యులు డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ వర్ణన అంశాన్ని ఇస్తూ సంగీత, సాహిత్య వేదికగా బెజవాడను వర్ణించమని కోరగా ఆశువుగా హద్యంగా పద్యం చెప్పారు అవధాని. పురాణ కావ్య పఠన అంశాన్ని వలివేటి శివరామకృష్ణమూర్తి నిర్వహించగా, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అప్రస్తుత ప్రసంగం చేశారు. ఆశువు అంశాన్ని నిర్వహించిన విద్యార్థులు పుస్తక మహోత్సవం, సిద్ధార్థ కళాశాల స్వర్ణోత్సవం తదితర అంశాలపై పద్యాలు కోరగా అవధాని తనదైన మెరుపువేగంతో పద్యాలు చెప్పి అలరించారు. అవధానం అనంతరం అవధాని డాక్టర్ మేడసాని మోహన్‌తో పాటు పృచ్ఛకులను డీన్ డాక్టర్ రాజేష్ జంపా, ఎఒ.శ్రీధర్ ఘనంగా సత్కరించారు. తొలుత సహాయక ఆచార్యులు డాక్టర్ సశ్రీ అవధానిని, పృచ్ఛకులను సభకు పరిచయం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, శాఖాధిపతి డాక్టర్ ఎన్.శివకుమార్ పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను కష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శ్రీ అమ్మవారి దర్శనానికి మంగళవారం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ డిప్యూటీ ఇఓ రత్న రాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించారు. అనం తరం అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

పుల్లూరులో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని పుల్లూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయ కుమారి మాట్లాడుతూ రైతులు వరి పంట కోసిన తర్వాత రబిపంట వేయనట్లయితే భూమిని ఏదో ఒక పంటతో కప్పి ఉంచడం ద్వారా భూమిలో సేంద్రియ కార్బనం పెంచుకోవచ్చన్నారు. పురుగు మందులతో పాటు వేప సంబంధ మందులను కలిపి వాడటం వలన పురుగుమందులు వాడకాన్ని తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం పొందుగల గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుల్లూరు సర్పంచి నాగమల్లేశ్వరి, ఏవో సంధ్యారాణి, ఏ ఈ ఓ లు డి ఎ లు, రైతులు పాల్గొన్నారు.

అక్షరాస్యత కోసమే ఉల్లాస్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 7వేల మంది ఎస్‌హెచ్‌జి సభ్యులను, వివిధ ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలో పనిచేసే వంట వారు, ఆయాలు, నైట్ వాచ్మెన్‌లో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా చేసేందుకు రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఉల్లాస్ అని మండల అభివృద్ధి అధికారి సునీత శర్మ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో జరిగిన ఉల్లాస్ ప్రోగ్రాంలో అక్షర వెలుగు వాచకాలను ఇబ్రహీంపట్నం ఎంపిపి పాలడుగు జ్యోత్స్న ద్వారా విద్యా వలంటీర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు.

సంక్రాంతికి రోడ్డు పూర్తయ్యేనా!

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల – జుజ్జూరు రోడ్డులో ప్రజలు నూతన సంవత్సరంలో కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. శంకుస్థాపన జరిగి నెలలు గడుస్తున్న నేటికీ కార్యరూపం దాల్చుకపోవడంతో ప్రయాణికులు స్థానికుల అవస్థలు వర్ణాతీతంగా మారాయి. కేవలం కిలో మీటరు రోడ్డు అభివృద్ధికి 60 లక్షలు మంజూరయ్యాయి. రోడ్డు అభివద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. రోడ్డు పనులు దక్కించుకున్న గుత్తేదారుడు నెల రోజుల క్రితం పాత రోడ్డు పగలగొట్టి మెటల్ వేసి రోలర్ తో చదును చేయించాడు. తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడలేదు. అదేమంటే రోడ్డు గట్టిపడాలి అని పాలకులు చెబుతున్నారు. మెటల్, డస్టు వేసి రోలర్‌తో చదును చేసినా పొడి వాతావరణానికి దుమ్ము ధూళితో పాదచారులు, ప్రయాణికులు, వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు.

చాదర్‌ను సమర్పించిన వెలంపల్లి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అజ్మీర్‌లోని ఖాజా గరీబున్ నవాజ్ గంధం మహోత్సవాల సందర్భంగా స్థానిక ప్రకాశం బ్యారేజ్ సమీపంలో గల హజరత్ సయ్యద్ షా ఖాదరి హజరత్ సయ్యద్ అలీ హుస్సేన్ షా ఖాదరి దర్గాలో నజీర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానాన్ని నిర్వహించారు.

విద్యా రంగ సమస్యలపై నిరంతర పోరాటాలు



ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా నూతన కమిటీ

- ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా మాజీ కార్యదర్శి వై.నరసింహారావు పిలుపు
- అధ్యక్ష కార్యదర్శులుగా ప్రేమ్‌కుమార్, సమరం ఎన్నిక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): విద్యా రంగంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ మాజీ కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. ఎస్ఎఫ్ఐ 50వ కృష్ణాజిల్లా మహాసభ సీతారాం ఏచూరి ప్రాంగణం (యుటిఎఫ్) ఆఫీసులో రెండు రోజుల పాటు నిర్వహించారు. స్వతంత్ర ప్రజాస్వామ్య సోషలిజం జెండాని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ ఎగరవేసి అనంతరం అమరవీల స్థూపానికి నివాళులర్పించారు. ఏచూరి, భగత్ సింగ్, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ ప్రజా సంఘాల నాయకులు ఈ మధ్యకాలంలో అమరులైన నాయకులకు నివాళులర్పించి వారి ఆశయ సాధనకు పని చేస్తామని పేర్కొన్నారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన వై.నరసింహారావు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినిలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టే విధంగా ఎస్ఎఫ్ఐ పని చేయాలన్నారు. ఐద్వా నాయకురాలు పి.రజిని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు, విద్యార్థులకు రక్షణ కల్పిస్తామని చెప్పినా ఆ విధంగా చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థినిలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, కృష్ణా యూనివర్సిటీలో హాస్టల్ ప్రారంభించాలని, విద్యార్థినిలకు రక్షణ కల్పించాలని, పీజీ విద్యార్థులకు 77 జీవో రద్దుచేసి ఫీజు రీయింబర్స్ కల్పించాలని డిమాండ్ చేశారు

13 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కమిటీ 13 మందితో ఏర్పాటైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఇ.ప్రేమ్ కుమార్, ఎస్.సమరం తిరిగి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నాగేంద్ర, శ్రీరామ్, సలీమ్, సహాయ కార్యదర్శిలుగా హారిక, పండు, ప్రదీప్, కమిటీ సభ్యులుగా శ్రావణి, ఫని పూజిత, అమీర్, బి.పూజిత ఎన్నికయ్యారు.

ఎపిపి శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-నందివాడ : నందివాడ మండలంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులకు మంగళవారం ఎపిపి శిక్షణా తరగతులు ప్రారంభమైనట్లు టివోటి వి శ్రీదేవి, ఎపిఎం కెవి వసంతరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు వారి వారి గ్రామాలలో గ్రామ సంఘాలకు వార్షిక ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఏడాదిలో ఏప కార్యక్రమాలు చేయాలి అనేది ఈ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గ్రామం సంఘాలు ప్రతి నెలా రెండు సమావేశాలు చొప్పున ఏడాదికి 24 సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగతులలో విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, జీవనోపాధి, సామాజిక భద్రత, ప్రవర్తనలో మార్పులు, సుస్థిరమైన ఆస్థుల



సృష్టి , నైపుణ్యం ద్వారా సామర్థ్యం పెంపు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు చిట్టిబాబు, టి.కృష్ణవేణి, మండలంలోని అన్ని గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కమాల ఉమామహేశ్వరవు కుమారుడు వెంకట్ లక్ష్మీ శ్రీనివాస్ 16 వ వర్ధంతి సందర్భంగా దావాజిగూడెం స్పందన వికలాంగుల పాఠశాలలో వికలాంగుల విద్యార్థులకు స్వీట్స్, బుక్స్, పెన్, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు మాట్లాడుతూ వెంకట్ లక్ష్మీ శ్రీనివాస్ మతి కుటుంబానికి తీరని లోటు అన్నారు.పిల్లలు చిన్నతనంలో ఉండగా భర్తను కోల్పోయిన రజని ,కుమారుని కోల్పోయిన ఉమామహేశ్వరవులు మనోదర్యంతో మనవడు, మనవరాలు ను ఉన్నత చదువులు చదివించి వాళ్ళు కాళ్లపై నిలబడేట్లుగా తీర్చిదిద్దిన ఉమామహేశ్వరవు, రజినీని అభినందిస్తున్నానని అన్నారు. స్పందన వికలాంగుల పాఠశాలను సొంత ఖర్చులతో నడుపుతున్నా స్పందన పాఠశాల చైర్మన్ వెంకట్, ప్రిన్సిపల్ రజితను అభినందించారు. తొలుత చిత్రపటానికి పూలమాలలు వేసిశ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కమాల ఉమామహేశ్వరవు, పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి,భార్య ముక్కమాల రజని,కుమార్తె వెంకట సాయిరత్న , కుమారుడు సాయి ప్రకాష్, సిహెచ్ వెంకటేశ్వరావు, చెర్మాన్ వెంకట్ ప్రిన్సిపల్ రజిత పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కోడూరు

యువతి అదృశ్యమైన సంఘటన కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కోడూరు ఎస్ఐ కే.చాణిక్య తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి బిందు మాధవి (15) సోమవారం మధ్యాహ్నం కోడూరులోని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. బిందు మాధవి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బిందు మాధవి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.



విద్యుత్ భారాలను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ: రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై మోపుతున్న విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ ఛార్జీలు భారీగా పెరిగాయన్నారు. భారాలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో సిపిఎం పోరాటాలను ఉధృతం చేస్తుందన్నారు. విద్యుత్ భారాలపై వివిధ రూపాల్లో ప్రజల్ని చైతన్యపరుస్తామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, లంకా సురేంద్ర, అవిర్నేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాకు మధ్యాహ్న భోజన కార్మికులు తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కుమార్ రాజాకు వినతిపత్రం అందించారు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.



ఐదుగురికి ఉద్యోగావకాశం

ప్రజాశక్తి-గుడివాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ-సీడాప్, గుడివాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు మంగళవారం గుడివాడలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల నందు "జాబ్ మేళా" నిర్వహించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి డా॥ పి.నరేష్ కుమార్, గుడివాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి సంయుక్తంగా తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి మాట్లాడుతూ, ఉద్యోగం చిన్నదా, పెద్దదా అన్న అపోహను యువత పెట్టుకోవద్దని, ఉద్యోగం చేసుకుంటూ వెళ్తే అదే ఆ వ్యక్తులను ఉన్నత స్థితికి తీసుకెళ్తుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో టాటా క్యాపిటల్ లిమిటెడ్, మోహన్ స్పిన్ టెక్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. మొత్తంగా 29 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 5 మంది ఎంపికయ్యారని, 02 షార్ట్ లిస్టు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల టి.ఓ జయరాం, ఆనంద్ వేణుగోపాల్, చారి, కళాశాల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది ఎన్.నాగాంజనేయులు, పి.శేషు బాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎంఎల్ఎ వర్ల కుమార్‌రాజా

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధానం : వర్ల

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా తీసుకుని ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈడుపుగంటి రాజామణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత వివిధ శాఖల అధికారుల నివేదికలను, తాము నిర్వహించే బాధ్యతలను వివరించారు. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అందులో భాగంగా నియోజకవర్గంలో అన్ని రోడ్లకు మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన, అవగాహన, అనుభవం, చాకచక్యం వలన రాష్ట్రం అభివద్ధిలో నడుస్తుందని తెలిపారు. మొక్కుబడి మాటలతో,మొక్కుబడి పనులు చేయకుండా ప్రతి ఒక్క అధికారి ప్రజల కోసం పనిచేయాలని తమ ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. గుడ్ గవర్నెన్స్ కోసం మండల లెవల్లో ఒక గ్రూపుని ఏర్పాటు చేసి మండల స్థాయి అధికారులంతా ఆ గ్రూపులో తాము నిర్వహించే పనులు ప్రతిరోజు ఆ గ్రూపులో పెట్టి, త్వరితగతిన ఆ సమస్యలు పరిష్కరించే విధంగా కషి చేయాలని తెలిపారు. జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి,ఎంపీడీవో కేవీఎస్ రవికాంత్, తహసిల్దార్ కుసుమకుమారి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

గ్రామసభలతో సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-మోపిదేవి: రైతుల ప్రయోజనాల కోసం రెవిన్యూ యంత్రాంగం గ్రామాలకు వెళ్లి నిర్వహిస్తున్న రైతు సదస్సులు సమస్యలకు పరిష్కార వేదికలుగా ఉన్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు మంగళవారం మోపిదేవి మండల పరిధిలోని అయోధ్య అడపవారి పాలెంలో మోపిదేవి తాసిల్దార్ మేడపాటి శ్రీవిద్య పర్యవేక్షణలో రైతు సదస్సు జరిగింది కల్లేపల్లి గ్రామంలో దాయాదుల మధ్య దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న రహదారి సమస్యలుకు సైతం పరిష్కార మార్గాలు సూచించారు. సదస్సు ముగిసిన తర్వాత మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో వేణుగోపాలరావు సమస్యాత్మక ప్రదేశానికి వెళ్లి ఇరు వర్గాలకు నచ్చజెప్పి పరిష్కరించే ప్రయత్నం చేశారు. విఆర్ఓ పీత రాంప్రసాద్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బుద్ధవరం రోడ్డులో అక్రమ కట్టడాలు

ప్రజాశక్తి-గన్నవరం: బుద్ధవరం రోడ్డులో జరుగుతున్న అక్రమ కట్టడాలు.. ఆక్రమణలకు నిలయమైంది. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగాయని స్థానికులు చెప్పారు. ఎవరికి వారు పంచాయతీ డ్రైనేజీ తోపాటు రోడ్డు స్థలాన్ని కూడా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. ముఖ్యంగా సి ఆర్ డి ఏ అనుమతులు లేకుండా రెండు, మూడు అంతస్తుల భవనాలు పడుతున్నారని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేసి ఈ నిర్మాణాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఆక్రమణలతో రోడ్డు రెండు పక్కల తగ్గిపోతుందని, కనీసం రెండు కార్లు తప్పుకోవడానికి కూడా వీలు ఉండడం లేదు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పెద్ద భవనాలు కడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్తున్నారు. భవిష్యత్తులో ఈ రోడ్డు విస్తరణ చేసి మండల పరిషత్ కార్యాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉన్నది. అయితే ఆక్రమణలో, అక్రమ కట్టడాల తో రోడ్డు విస్తరణ తగ్గిపోతుంది. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి రోడ్డు సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని, అక్రమ కట్టడాలు నిర్మూలించాలని కలెక్టర్ను కోరుతున్నారు. ఈ రోడ్డులో ఎండిఓ కార్యాలయంతో పాటు బాలికల ఉన్నత పాఠశాల, ఇతర ప్రభుత్వ అధికారుల కార్యాలయాలు ఉన్నాయి. జనం తాకిడి, వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోడ్డు చాలా రద్దీగా ఉంటుంది. అందువల్ల అనుమతులు లేని కట్టడాలపై సీఆర్డీఏ అధికారులు రంగంలోకి దిగాలని అంటున్నారు.

రైల్వేలైన్ భూ బాధితులకు నష్టపరిహారమివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు మండల కేంద్రంలోని అల్లూరు గ్రామంలో రెవెన్యూ గ్రామ సభలో రైల్వే లైన్ కింద భూములు కోల్పోయే రైతుల్ని, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని కార్మిక సంఘాలు, సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వీరులపాడు మండలం అల్లూరు గ్రామ రెవెన్యూ సదస్సులో మండల తహశీల్దార్ షేక్ హుస్సేన్‌కు సిపిఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కోట కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమరావతి రైల్వేలైన్ కింద భూములను తీసుకొనుటకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఎర్రుపాలెం నుండి వీరులపాడు మండలం గూడెమాధవరం తిమ్మాపురం చెన్నారావు పాలెం రంగాపురం జుజ్జూరు నరసరావుపాలెం కంచికచర్ల మండలం గొట్టముక్కల, పరిటాల, కొత్తపేట, దాములూరు పరిధిలో సుమారు రెండు వందల ఎకరాలు సాగు భూములను తీసుకున్నందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ భూములపైన ఆధారపడిన వ్యవసాయ కార్మికులు, పేదలకు ఉపాధి సౌకర్యాలు కల్పించాలని రైల్వేలైన్ కింద భూములు కోల్పోతున్న కుటుంబాల వారికి ఉద్యోగం ఇవ్వాలని రైల్వే అండర్ పాసులు నిర్మించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, మండల కమిటీ సభ్యులు లాల్ అహ్మద్ పాల్గొన్నారు.

వివిధ గ్రామాల్లో రైల్వే మార్గంలో వెళ్లే రైతుల భూములకు అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. పోలాలకు వెళ్లే డొంక రోడ్డు రైల్వే లైన్‌లో పోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా రహదారి సౌకర్యం కల్పించాలని మాజీ జెడ్పిటిసి సభ్యులు కోటేరు ముత్తారెడ్డి ఆధ్వర్యంలో నందిగామ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. పెద్దాపురం గ్రామ రైతులు తమ పంట పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని రైతులు కోరారు. ఆర్డీవో రైతులతో మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి సౌకర్యం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారికి హామీ ఇచ్చారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని పలుచోట్ల సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ఎ.కొండూరు : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చీమలపాడులో విజయవాడ భద్రాచలం జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు పారిశ్రామిక వేత్తలకు లాభం చేకూర్చాడానికి పేద ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. ఎన్నికల కు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని ప్రజలకు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోనే రెండు సార్లు కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై 17వేల కోట్లు భారం మోపిందన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై విద్యుత్ ఒప్పందంపై ప్రజాభిప్రాయసేకరణలో భాగంగా నిరసన కార్యక్రమం చేపట్టినట్టు అయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** ఇటీవల ఏర్పడ్డ రాష్ట్ర నూతన ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని మండల సిపిఎం సీనియర్ నాయకులు దంతాల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో జగ్గయ్యపేట వెళ్లే రోడ్డుపై మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దంతాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రూ ఆఫ్ చార్జీలను 2022, 23, 24 సంవత్సరాలకు సంబంధించి అదనపు భారాన్ని బిల్లులకు జమ చేయడం సరైంది కాదన్నారు. దీనితో సామాన్యుడు బిల్లులు కట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ గౌస్ మియా, కోటా రవికుమార్, కాకనబోయిన సుబ్బారావు పాల్గొన్నారు. **గంపలగూడెం:** ఇటీవల ఏర్పడ్డ రాష్ట్ర నూతన ప్రభుత్వం అడ్డగోలుగా వివిధ రకాల తో విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని గంపలగూడెం సిపిఎం మండల కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మద్దిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గువ్వల సీతారామరెడ్డి పాల్గొని మాట్లాడారు. తేలూరి శాంత కుమారి, ఎం కుటుంబరావు, జి వీరభద్రం, మీసాల గోపాలరావు, పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** రంగాపురం గ్రామ శివారు తాడిగూడెంలో పెంచిన విద్యుత్ చార్జీల బిల్లులను సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎం.మాధవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం మాట తప్పి ట్రూఅప్ చార్జీలతో రాష్ట్ర ప్రజలపై మోయలేని భారాలు వేయడం చాలా బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల వీరాస్వామి పాల్గొన్నారు.



గంపలగూడెంలో అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు



ఎ.కొండూరులో నిరసన తెలుపుతున్న దృశ్యం



రెడ్డిగూడెంలో బిల్లులు దహనం చేస్తున్న దృశ్యం

క్లాప్ ఆటో డ్రైవర్ల ధర్నా



ఆందోళన చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి - విజయవాడ : సింగినగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని 6వ రోజు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు క్లాప్ ఆటో యూనియన్ కన్వీనర్ శివ అధ్యక్షత వహించగా సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతి బస్సు మాట్లాడుతూ కార్మికులకు పని భద్రత కల్పించాలని రెండు నెలల పెండింగ్ వేతనాన్ని వెంటనే వేయాలని ప్రతి నెల 5వ తారీఖున జీతం ఇవ్వాలని పండుగ సెలవులు ఆదివారం ఫుల్ డే సెలవు అలాగే 24,500 రూపాయలు జీతం గా ఇవ్వాలని పని భద్రత కల్పించాలని క్లాప్ ఆటో డ్రైవర్స్ అందరినీ ఆప్కాస్ సంస్థలో చేర్చాలని ఈఎస్ఐ పిఎఫ్ అవకాశం కల్పించాలని అలాగే క్లాప్ ఆటో ప్రతి డ్రైవర్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం వారు విజయవాడ కార్పొరేషన్ వారు స్వయంభు ట్రాన్స్పోర్ట్ కంపెనీ వారు ఈ డిమాండ్స్ మీద బాధ్యత వహించాలని ఆ విధంగానే తదితర అంశముల మీద ధర్నా నిర్వహించడం జరిగింది పాల్గొన్నటువంటి సిఐటియు ముఖ్య నాయకులు మున్సిపల్ యూనియన్ నగర కోశాధికారి డి స్టీఫెన్ బాబు నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టీ ప్రవీణ్ నగర సహాయ కార్యదర్శి శీలం దాస్ క్లాప్ ఆటో యూనియన్ కార్మికులు రుద్ర రామరాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిపిసిఎల్ ట్రక్ డ్రైవర్ల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - జి.కొండూరు : కొండపల్లి పారిశ్రామికవాడలో బిపిసిఎల్ ఆయిల్ టెర్మినల్ ట్రక్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జనరల్ బాడీ సమావేశం మంగళవారం సిఐటియు జిల్లా కార్యదర్శి యం.మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో బిపిసిఎల్ ట్రక్ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బిపిసిఎల్ ఆయిల్ ట్రక్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) నూతన కార్యవర్గంగా మొత్తం 15 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా తమ్మిశెట్టి శివకృష్ణ, కార్యదర్శిగా చెన్నూరి అంకరాజు వైస్ ప్రెసిడెంట్‌గా కొట్టే వేణు, కోశాధికారిగా మారెళ్ళ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా వంపుగళ్ళ జోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ బిపిసిఎల్ ఆయిల్ టెర్మినల్ ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి 24 గంటలు డ్రైవర్లు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. పెరిగిన ధరలు కరెంటు ఛార్జీలు ఇంటి హద్దులు పిల్లల స్కూల్ ఫీజులు వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. బిపిసిఎల్ టెర్మినల్‌లో పనిచేస్తున్న ట్రక్ డ్రైవర్లకు, క్లీనర్లకు కనీస వేతనం, రోజువారి బేటా పెంచడంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు ఉరితాడు లాంటి చట్టం ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ కేసు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.కొండూరు మండల అధ్యక్షుడు ఎస్.సుందరరావు, మండల ఉపాధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు ప్రతాప్, కరుణాకర్, వీరబాబు,శ్రీనుపాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలిని విధుల్లోకి తీసుకోవాలి


ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 6 సంవత్సరాలుగా శానిటేషన్ కార్మికురాలిగా పనిచేస్తున్న ఇందిర అనే కార్మికురాలిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సౌమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు.

దీపం కనెక్షన్ మార్పుకు అవకాశం

ప్రజాశక్తి- తిరువూరు : దీపం గ్యాస్ కనెక్షను పొందిన మహిళ మరణిస్తే ఆమె స్థానంలో కుటుంబంలో వేరొకరి పేరుతో కనెక్షన్ మార్పుకు అవ కాశం కల్పిస్తున్నట్లు తిరువూరు శ్రీరఘు గ్యాస్ ఏజన్సీస్ మేనేజరు గంజా కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. మరణించిన మహిళకు ఉన్న రేషన్ కార్డులో సభ్యులుగా ఉన్న భర్త లేదా పిల్లల పేరుతో దీపం కనెక్షను మార్చడానికి ఇండేన్ గ్యాస్ ఏజన్సీలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని వినతి

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రజలపై ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రభుత్వం మోపుతున్న భారాలను వెంటనే ఉపసంహరించాలని వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. విద్యుత్ టారిఫ్‌ల అంశంపై ఎపి విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మంగళవారం ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో వైసిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్‌తో కలిసి ఎపిఇఆర్‌సి రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ 2025-26లో భారాలు లేవంటూనే సర్దుబాటు ఛార్జీల ద్వారా రూ.15,485.36 కోట్ల భారం ముందుగానే మోపారని మల్లాది విష్ణు ఆరోపించారు. ఏ.ఆర్.ఆర్. ప్రతిపాదనలకు సంబంధం లేకుండా వినియోగదారులపై వివిధ రూపాల్లో భారం మోపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 50 లక్షల పేద కుటుంబాలతో సహా 2 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులపై అధిక భారం పడుతోందన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అవినాష్, విష్ణు

9న ఆరోగ్య బడ్జెట్‌పై రౌండ్‌టేబుల్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9 వ తేదీన నగరంలోని ఎం . బి.భవన్ నందు ఆరోగ్య బడ్జెట్ పై రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అత్యధిక శాతం ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చుచేయాలని అన్నారు. వాస్తవానికి బడ్జెట్లో 5 శాతం ఆరోగ్యానికి ఉండాలని అన్నారు. కానీ కేవలం 2 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని అన్నారు. దీనిపై పలువురి అభిప్రాయాలు తెలుసుకోవడానికి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని అందరూ పాల్గొనాలని కోరారు

సాగర్ జలాలు విడుదల

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో నూజివీడు బ్రాంచ్ కెనాల్ కి సోమవారం రాత్రి నుండిమైలవరం నియోజక వర్గ శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో సాగర్ జలాలు సరఫరా అవుతున్నాయని, ఈ సాగర్ జలాలను సద్వినియోగపర్చుకొని రైతులు చెరువులు నింపుకోవాలని ఎన్ఎస్పి 10 డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ కొల్లి శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నూజివీడు బ్రాంచ్ కెనాల్ కు 600 క్యూసిక్కులు నీళ్ల సాగర్ జలాల సరఫరా అవుతున్నాయని, రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకుని చెరువులు నింపుకోవాలని, ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకుగాను ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ ప్రత్యేక చొరవతో సాగర్ జలాలను ప్రాంతానికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డి గూడెం మండలం రంగాపురం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు బరులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. తహశీల్దార్ జె.సుశీలదేవి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి.మోహన్ రావు కలిసి పందేల బరులు పరిశీలించి వాటిని ధ్వంసం చేశారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో మాట్లాడుతూ హైకోర్టుఉత్తర్వుల ప్రకారం కోడి పందేలు నిర్వహణ చట్టరీత్య నేరమని స్థానికులకు అవగాహన కల్పించి బరులను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, గ్రామ రెవెన్యూ అధికారి కే.రాజేష్ రెవెన్యూ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు మైలవరం డిగ్రీ కళాశాల విద్యార్థిని

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక డాక్టర్ లకిరెడ్డి హమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న పి.సీత దక్షిణ భారత విశ్వవిద్యాలయ కృష్ణా యూనివర్సిటీ తరపున వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఇళ్ల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ పోటీలకు ఎంపికైన సీతను ఫిజికల్ డైరెక్టర్ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు అభినందించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో నూకల రవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటును శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మంగళవారం ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి మొదటి మ్యాచ్‌ను ప్రారంభించి క్రీడాకారులతో పరిచయం చేసుకుని కాసేపు సరదాగా క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ యువకులు శారీరక దృఢత్వం కోసం ఆటలు ఆడాలని సూచించారు.

వికలాంగులకు పథకాలు అందేలా చూడాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వికలాంగ పిల్లలకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు.సహిత విద్యలో దివ్యాంగ విద్యార్థులను ముందుగా గుర్తించడం, వారిని భవిత కేంద్రాలలో మరియు ప్రత్యేక విద్య అందించే పాఠశాలల్లో వారిని చేర్పించడం, అదేవిధంగా వారికి వత్తి విద్యకు సంబంధించి శిక్షణను అందించడం దివ్యాంగుల చట్టం 2016 ను అనుసరించి గురించి అందరికీ తెలియజేయడం వంటి అంశాలపై మండల విద్యాశాఖ అధికారులకు, ఇతర అధికారులకు మంగళవారం కలక్టరేట్ సమావేశ హాలులో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణా జిల్లా రెవిన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధి కోసం పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు, వాటిని సక్రమంగా విద్యార్థులకు అందేలా చూడవలిసిన భహత్తర భాద్యత



మాట్లాడుతున్న డిఆర్ఒ చంద్రశేఖరరావు

ఎం ఈ ఓ లపై ఉందన్నారు. సమగ్ర శిక్ష కష్ణాజిల్లా ఏపీసి కె. రాములు నాయక్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ద్వారా దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్ ల ద్వారా బోధన, అలవెన్సులు లు అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఫిజియోథెరపీ, ఉపకరణముల్ పంపిణీ పంటి కార్యక్రమాలు చేపడుతున్నామని పాఠశాలకు రాగలిగే దివ్యాంగులను, ప్రత్యేక విద్యను అందించడం, వత్తి విద్య లో శిక్షణ ఇవ్వడం వలన వారికి జీవన ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. జిల్లా డిజబుల్ అండ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ బి. కామరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ద్వారా ఎన్నో పథకాలు మరియు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామని అధికారులు ఈ పథకాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఐ.ఇ.డి కోఆర్డినేటర్ పి.వనజ వికలాంగుల చట్టం-2016 లోని 21 వైకల్యముల గురించి, అదేవిధంగా దివ్యాంగ విద్యార్థులను చిన్నప్పుడే ఏ విధంగా గుర్తించాలి. వారికి ఎటువంటి శిక్షణ ఇవ్వాలి అలాగే వాళ్ళకి ఎటువంటి థెరపీ లను అందించాలి అనే విషయాలను. గురించి క్షుణ్ణంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఎయల్‌యస్ఒ రామకృష్ణ, సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ ఎస్ రాంబాబు, సమగ్ర శిక్ష సెక్టోరల్ సిబ్బంది డి.నగేష్, టి.రమేష్, అబ్దుల్ సుభాన్, కే.ఏడుకొండలు, ఓ.రామకష్ణ, జి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

12 వరకు ఎస్‌సి కులగణనపై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఎస్‌సి కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కే.బాలాజీ తెలిపారు. ఈ 7వ తేదీతో గడువు ముగియనుండటంతో మరొక ఐదు రోజులు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌ఓపీ విధివిధానాలు తెలుపుతూ ప్రభుత్వం 265 నంబరు జీవో విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జనవరి 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.

మట్టి లారీలు పట్టివేత

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం ముస్తాబాద్ రైల్వే ట్రాక్ పక్కన పోసిన నల్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీలను గన్నవరం పోలీసులు పట్టుకున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ప్రేమ్ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి లారీలను నిలుపుదల చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్రమంగా మట్టిని తరలించడంపై కేసు నమోదు చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వేధింపులు ఆపాలని వైసిపి నిరసన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని శేరి దగ్గుమిల్లి గ్రామంలో కూటమి నాయకుల వేధింపులు ఆపాలని వైసిపి నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. తాడిచర్ల గ్రామానికి చెందిన పల్లెం వెంకయ్య 15 రోజుల క్రితం పంచాయతీకి సంబంధించి నిధులు వినియోగం గురించి సమాచారం ఇవ్వమని స్పందనలో అర్జీ చేశారు. ఈనెల 7వ తేదీ మంగళవారం సమాచారం ఇవ్వాల్సిన ఆఖరి తేదీ అయినప్పటికీ కూడా సమాచారం ఇవ్వకపోగా అతనిపైన కూటమి నాయకులు అధికారుల తో వేధింపులపర్వం అధికమైనట్లు తెలిపారు .ఆ కారణంగా కూటమి నాయకుల వేధింపులు ఆపమని మండల వైసిపి నాయకులు నిరసన వ్యక్త చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ కోటప్రోలు నాగు, ఎంపిటీసీ ముక్కు

కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ ఎంటిఎస్‌ని వర్తింపజేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఈ నెల 6 వ తేదీన విడుదల చేసిన జీవో ప్రకారం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఏ విధమైనటువంటి ఉయోగకరంగా లేదని రాష్ట్ర ఆర్ట్, క్రాఫ్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్.ఎన్ దేవేంద్ర పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 25 వేల కాంట్రాక్ట్ మంది ఉద్యోగులు అనేక సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ దుర్భరమైనజీవితాలను,గడుపుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు, అని రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్.ఎన్ దేవేంద్ర. తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మన ప్రభుత్వం తప్పకుండా వస్తుంది. మీ అందరికీ న్యాయం జరుగుతుందని నాడు ఎన్నికల హామీ లో భాగంగా పవన్ కళ్యాణ్ జనవాణిలో, యువగళం పాదయాత్ర నారా లోకేష్ పాదయాత్రలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా ఇటీవల కూడా చంద్రబాబు నాయుడు మరియు కళ్యాణ్, మరియు లోకేష్ కలవడం జరిగిందని,వారు తప్పకుండా న్యాయం చేస్తాము అని చెప్పారని కానీ నేడు ఆర్థిక శాఖ వారు విడుదల చేసిన జీవో ఎటువంటి ప్రయోజనకరంగా లేదు కాబట్టి ఆ జీవోను ఒకసారి పునసమీక్షించాలని, తద్వారా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 25 వేలమంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చాలని, సమగ్ర శిక్ష అన్నివిభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కి మినిమం టైమ్ స్కేలును, అమలు చేయాలని, కారుణ్య నియామకాలను జరిపించాలని, ఉద్యోగి సాధారణ మరణం సంభవించినప్పుడు, ఇచ్చే రెండు లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియాను ఐదు లక్షలకు ప్రమాదం జరిగి మరణించినప్పుడు 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచాలని, ఈఎస్ఐ మరియు ఈపీఎఫ్ సౌకర్యాలను కలగజేయాలని, సమగ్ర శిక్షలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. లయన్ బొప్పన శివప్రసాద్, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక వితరణతో మండలంలోని పెంజెంద్ర గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో 62 పశువులకు 30 గొర్రెలకు పశు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పది వేల రూపాయల విలువగల మందులు ఉచితముగా పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, లయన్స్ సభ్యులు సూరపనేని పరంధామయ్య, పోలవరపు వెంకట్రావు, వల్లభనేని వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

మినుము రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని ఉలవలపూడి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి లోయ సునీల్ రైతులు సాగుచేసిన మినుము పంటలో ఏర్పడే తెగుళ్ల వాటి నివారణపై తగు సూచనలను రైతులకు తెలిపారు. అధిక మోతాదులో పురుగుమందులు వాడరాదని పంటకు ఏర్పడిన తెగుళ్ల వాటి నివారణకు పనిచేసే మందులను సరిపడా పిచికారి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కర్ రావు, రైతులు పాల్గొన్నారు.

9న హాకీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

సబ్ జూనియర్ బాలుర జిల్లా స్థాయి హాకీ జట్టు ఎంపిక ఈ నెల 9న ఉదయం 9 గంటలకు గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు హాకీ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణం హరికృష్ణ తెలిపారు. సబ్- జూనియర్ బాలుర క్రీడాకారులు 01-01-2009 తర్వాత జన్మించి ఉండాలని, ఎంపికైన బాలుర జట్టు ఈ నెల 17,18,19 తేదీలలో మదనపల్లెలో జరిగే హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ చాంపియన్ షిప్ లో పాల్గొంటారని తెలియజేసారు, ఈ సెలక్షన్స్ కు క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేది ధ్రువపత్రం, నాలుగు పాస్‌పోర్టు ఫోటోలతో హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 7013786846 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-చల్లపల్లి: కోడిపందేలను నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని చల్లపల్లి తహశీల్దార్ డి.వనజాక్షి అన్నారు. మంగళవారం చలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ , చల్లపల్లి మండలంలో కోడి పందాలు జరక్కుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. సీఐ కె ఈశ్వరరావు మాట్లాడుతూ, కోడిపందాలు నిర్వహణకు ఎక్కడైనా బర్లు ఏర్పాటు చేస్తుంటే వెంటనే తమకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఎస్సై పి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, కోడి పందాలు పేకాటను నివారించేందుకు గ్రామస్థాయిలో మరియు మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో ఎ.వెంకటరమణ మాట్లాడుతూ, కోడిపందాలు నిర్వహించు గ్రామస్థాయిలో గుర్తించి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ వనజాక్షి

అధికారులకు తెలియజేయాలన్నారు. మండల వైద్యాధికారి పి.మనోజ్ మాట్లాడుతూ, కోడిపందాలు నిర్వహించడం ద్వారా జీవన హింస చట్ట రీత్యా నేరమని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. కోడి పందాలు నిర్వహించడం నేరమని పేర్కొంటూ సంబంధిత పోస్టర్‌ను విడుదల చేశారు.

ఎన్‌సిసి ప్రాక్టికల్ పరీక్ష

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మండలం గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి ఎ సర్టిఫికెట్ కొరకు ప్రాక్టికల్ ఎగ్జామ్ హవల్దార్ నాజర్ హుస్సేన్ మరియు హవల్దార్ జితేంద్ర వార్డ్ మరే పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించబడింది. కంపాస్,



ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, 0.22 రైఫిల్, డ్రిల్ టెస్ట్ మొదలైన వాటిపై ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు.ప్రధానోపాధ్యాయులు డి పుష్పలత, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం అరుణ, సిహెచ్ రాజేష్ ఆధ్వర్యంలో ఎన్సిసి ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కంకిపాడు: ప్రజానాట్యమండలి నూతన సంవత్సర కేలంబర్‌ను పోరంకిలో ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికిపాటి రాజారావు విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కేలండర్‌ను అనుమోలు స్టడీ టేబుల్ టెస్ట్ చైర్మన్, కళాకారుడు అనుమోలు ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్



ఖాసిం, అధ్యక్షులు కొండలబాబు, సిఐటియు నాయకులు త్రిమూర్తులు, మస్తాన్ పాల్గొన్నారు.

10న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి-గన్నవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ - సీడాప్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త అధ్వర్యంలో ఈ నెల పదో తేదీ శుక్రవారం గన్నవరం లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీస్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావాలని, మరిన్ని వివరాలకు 94940 05725 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం: బుద్ధవరంలో మురికి కాలువలో ఇళ్లు కోల్పోయిన పేదలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజి సొమ్ము ఇవ్వకపోవడం బాధాకరమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం



చేశారు. దావాజీగూడెంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 2014లో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణలో ఇళ్లు కోల్పోయిన పేదలకు, మురికి కాలువ కోసం తీసుకున్న వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించకుండా వదిలేశారని తెలిపారు. తక్షణమే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.157 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు కొండా వీరస్వామి, పరసా వెంకటేశ్వరరావు, గౌరీ శంకర్, మన్నెం గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని ఎస్‌విఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగవల్లులను మండలి వెంకట్రామ్ సతీమణి మండలి సాయి సుప్రియ, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ తిలకించి



అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌విఎల్ క్రాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు దుట్టా వెంకట వసుమతి, ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు పర్యవేక్షించారు.



హక్కుల ఉద్యమకారుడు సాయిబాబా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్: హక్కుల ఉద్యమకారుడిగా సాయిబాబా ప్రజాస్వామ్య విలువలను నమ్మే వారందరికీ ఆదర్శప్రాయుడని ఆయన సహచరి ఎ. ఎస్. వసంతకుమారి అన్నారు. 35వ విజయవాడ పుస్తకమహోత్సవంలో ఆరవ రోజు రామోజీరావు సాహిత్యవేదిక మీద నిర్వహించిన ఆఖరి కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘం వారు ప్రచురించిన అరుణతార ప్రత్యేక సంచిక 'ప్రపంచ విప్లవ మానవుడు కామ్రేడ్ సాయిబాబా'ను సాయి బాల మిత్రుడు కె.ఎం.ఎం.ఆర్ ప్రసాద్ ఆవిష్కరించారు. అదే వేదిక మీద సాయిబాబా స్ఫూర్తి కవిత్వం నిండిన 'నువ్వెళ్లిన దారిలో' సాయి సహచరి ఎ.ఎస్. వసంతకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తమ సాహిత్యాన్నుంచి మానవీయ విలువలను పుణికిపుచ్చుకున్నాడు. సామ్రాజ్యవాదానికీ, ప్రపంచీకరణకూ వ్యతిరేకంగా అనేక రచనలు చేశాడని చెప్పారు. సాయిబాబా ఆలోచనలనూ, ఆయన కలలనూ సాకారం చేసేందుకు మిత్రుల సహాయంతో ప్రయత్నిస్తామన్నారు. కె.ఎం.ఎం.ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ మంచి అధ్యయనశీలి అన్నారు. పోలియోతో రెండు కాళ్లూ పోగొట్టుకున్నా ప్రకృతిని ప్రేమించాడన్నారు, విద్యార్థిదశనుంచే క్రమశిక్షణ కలిగిన జీవితం గడిపేవాడన్నారు. తాను జైలులో ఉండి కూడా, తనతో పాటు విచారణ ఖైదీలుగా ఉన్న ఆదివాసుల హక్కుల కోసం పోరాడానికి మానవతావాది అని వివరించారు. కవితాసంచిక సంపాదకురాలు వైష్ణవి శ్రీ, శ్రీరాం తదితరులు సభలో పాల్గొన్నారు.

కవి ఆలూరి బైరాగి శత జయంతి సభ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజలకు అర్థమయినదానికన్నా అపార్థానికి గురైన కవి ఆలూరి బైరాగి అని సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. ఆయనను సరిగ్గా అర్థంచేసుకోక నిరాశావాది, అరాచకవాది అని చిత్రీకరించారన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆరవరోజు మంగళవారం రామోజీరావు సాహిత్యవేదిక మీద నిర్వహించిన ప్రధాన వేదిక మీద మొదటి కార్యక్రమంగా కవి ఆలూరి బైరాగి శతజయంతి సభ నిర్వహించారు. దానిలో ప్రధానవక్తగా మాట్లాడుతూ కవిత్వాన్నే శ్వాసగా జీవించిన బైరాగి తనదైన వ్యక్తీకరణ, పదవిన్యాసంతోబాటు చిక్కనైన మానవత్వ భావాలూ, సామాజిక స్పృహతో తెలుగు సాహితీ ప్రేమికుల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. ఆ రోజుల్లోనే పర్యావరణ స్పృహ కనబరిచారన్నారు. నేటి యువత తప్పనిసరిగా బైరాగి కవిత్వాన్ని చదవాలని సూచించారు. బైరాగి కవిత్వాన్ని పునఃముద్రణ చేస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన బండ్ల మాధవరావు మాట్లాడుతూ పాఠకుల హృదయాల్లో నిలిచిపోయే పదచిత్రాల సృష్టికర్తగా ఆలూరి బైరాగి గుర్తుండి పోతారన్నారు. బాలల పత్రిక చందమామ హిందీ సంచికకు కొంతకాలం పాటు సంపాదకులుగా వ్యవహరించారన్నారు. పిల్లల పత్రికల్లో పిల్లలకు అర్థమయ్యే సులువైన భాషలో రాసారని వివరించారు. జీవితాంతం కవిత్వం రాయడమే ప్రధాన వ్యాపకంగా జీవించాడని చెప్పారు. బైరాగి మరణానంతరం సంపుటీకరించిన ఆయన కవిత్వ సంకలనం 'ఆగమగీతి'కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందన్నారు. బైరాగి వెళ్లిపోయినా ఆయన కవిత్వ సౌరభాలు పాఠకుల హృదయాలను విడిచి పోవన్నారు. గుమ్మా సాంబశివ రావు సభకు స్వాగతం పలికారు.

పుస్తక మహోత్సవంలో నేడు

జనవరి 8వ తేదీ బుధవారం: సాయంత్రం 6.30 గంటలకు కీర్తిశేషులు ఎన్. నటరాజన్ (శారద) శత జయంతి సభ, వక్తలు శ్రీ పెనుగొండ లక్ష్మీనారాయణ, సాయంత్రం 7 గంటలకు ప్రజాశక్తి బుక్ హౌస్ పుస్తకావిష్కరణ సభ, రతన్ టాటా ప్రతిభావేదికపై సాయంత్రం 6 గంటల నుండి 8-30 గంటల వరకు -క్విజ్

బుర్రకథకు ప్రామాణిక రూపం ఇచ్చిన నాజర్

శతజయంతి సభలో వక్తలు


నాజర్ జయంతి సభలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : తెలుగులో బుర్రకథకు ఒక ప్రామాణిక రూపం కల్పించి, పండిత పామరులకు ఆమోదయోగ్యంగా, ఆస్వాదనీయంగా తీర్చిదిద్దిన ఘనత షేక్ నాజర్‌దేనని ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆరవరోజు మంగళవారం రామోజీరావు సాహిత్యవేదిక మీద నిర్వహించిన ప్రధాన వేదిక మీద రెండో కార్యక్రమంగా బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ శతజయంతి సభ నిర్వహించారు. ప్రధానవక్తగా ఆయన మాట్లాడుతూ నాజర్‌ను కేవలం బుర్రకథ పితామహుడిగా గుర్తుపెట్టుకుంటే ఆయన కృషికి అన్యాయం చేసినట్లేనన్నారు. తెలుగులో ప్రజాపాటకు, అభ్యుదయ గీతాలకు మూలపురుషుడన్నారు. సుద్దాల హనుమంతుతో సమకాలీనుడుగా ఉంటూ నాజర్ ఆ తర్వాతి వారైన గద్దర్, వంగపండు, పాణిగ్రాహి తదితర ప్రజాకళాకారులకు గురుతుల్యుడయ్యాయని వివరించారు. తాడిత పీడిత ప్రజల బాధలని వాళ్ల నుడికారంలోనే ప్రతిధ్వనింప చేసి, అలాంటి రచనలన్నిటికీ ఆదర్శవంతమైన నమూనాలను అందించాడన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఖాదర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ బిచ్చమెత్తి సంగీత విద్య నేర్చుకున్న నాజర్ తర్వాతి కాలంలో తన బుర్రకథలో ఆనాటి కళాకారులందరి హృదయాలను గెలుచుకున్నారన్నారు. సంగీత దర్శకుడు చక్రవర్తి, నటి జమున నాజర్ శిష్యులేనన్నారు. సినీవిమర్శకుడు రంగావఝ్ఝల భరద్వాజ మాట్లాడుతూ ఒకే వ్యక్తి అన్ని పాత్రలనీ, అన్ని రసాలనూ పోషిస్తూ, మూడు గంటల సేపు శ్రోతలను అలరించే కళారూపం బుర్రకథ అని వివరించారు. ఇంత అద్భుతమైన ప్రక్రియను పూర్తిస్థాయి ప్రజాకళగా మార్చి చిరస్థాయి కల్పించిన వ్యక్తి నాజర్ అన్నారు. ప్రముఖ పత్రికా సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆ రోజుల్లో ప్రజల్లో తిరిగి ప్రజలను ప్రభావితం చేసి, వారి గుండెలలో నిలిచిపోయినవారే సెలబ్రిటీలుగా ఉండేవారన్నారు. అలాంటి వారు నేడు విస్మరించబడటం దురదృష్టకరమన్నారు. ప్రజా సమస్యలనే కళారూపాలుగా మార్చి ఆదరణ పొందే అవకాశం ఉండటం కారణంగానే ఆదర్శవాది అయిన నాజర్ కళాకారుడిగా మారాడన్నారు. వివిధ పాత్రల ద్వారా పీడితతాడితుల ఆర్తిని, ఆవేదనను, ఆవేశాన్ని సులువుగా ప్రేక్షకులకు అందించడం నాజర్ ఘనత అని వివరించారు. నాజర్ కుమారుడు బాపూజీ మాట్లాడుతూ కేవలం ఒకే బాణీతో నడిచే పూర్వజానపద కళారూపాలకు శాస్త్రీయ సంగీత స్వభావాన్ని అద్ది, సందర్భానికి తగ్గట్టు నడకను మార్చి ఆ కళారూపానికి ఔన్నత్యం తెచ్చారన్నారు. పండితపామరులిద్దరినీ ఆకర్షించేలా, శాస్త్రీయ, జానపద బాణీలను మేళవించడం నాజర్‌కే సాధ్యమన్నారు. సాహితీ స్రవంతి బాధ్యులు వొర ప్రసాద్ తదితరులు సభలో పాల్గొన్నారు.

10న జెవివి మ్యాజిక్ షో!

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న విజయవాడ పుస్తక మహోత్సవం -లిరతన్ టాటా ప్రతిభా వేదిక (పిల్లలు సందడి చేసే డయాస్)లో ఈనెల 10వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మేజిక్ షో ఉంటుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ సాయంత్రం క్లైమేట్ చేంజ్ పై అవేర్నెస్ ప్రోగ్రాం ఉంటుందనీ, ప్రతిభా వేదిక వద్ద వండర్ సైన్స్ షో, ఆకాశంలోని అద్భుతాలను టెలిస్కోప్‌లో వీక్షించవచ్చని తెలిపారు. ఆయా ఈవెంట్లలో బహుమతులు కుడా ప్రదానం చేస్తామని తెలిపారు. విద్యార్థులు తమ తల్లి దండ్రులతో వచ్చి పాల్గొనాలని రామారావు కోరారు.


అరుణతార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం


జెవివి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెలిస్కోప్‌ను చూస్తున్న విద్యార్థులు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎస్‌యుడి లైఫ్ మిడ్‌క్యాప్ ఫండ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్టార్ యూనియన్ డై ఇచి లైఫ్ ఇన్సురెన్స్ కో లిమిటెడ్ (ఎస్‌యుడి లైఫ్) ఈ కొత్త సంవత్సరంలో ఎస్‌యుడి మిడ్‌క్యాప్ మొమెంటం ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి ప్రశాంత్ శర్మ తెలిపారు. శక్తివంతమైన మిడ్-క్యాప్ మార్కెట్ వృద్ధి సామర్థ్యాన్ని వినియోగించుకోవడానికి పాలసీదారులకు ఉత్తేజకరమైన అవకాశాన్ని అందిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ప్రశాంత్ శర్మ చెప్పారు. మిడ్‌క్యాప్ కంపెనీలు నిరూపితమైన వ్యాపార నమూనాను కలిగి ఉంటాయని, అధిక వృద్ధికి ప్రధానమైనవి ఈక్విటీ మార్కెట్‌ల యాజమాన్యంలో తక్కువగా ఉంటాయన్నారు.. మిడ్ క్యాప్ సూచీలు అధిక అస్థిరతను ప్రదర్శిస్తున్నప్పటికీ, లార్జ్ క్యాప్ సూచీలతో పోలిస్తే అవి దీర్ఘకాలికంగా అధిక రాబడిని అందజేస్తాయన్నారు. ఎస్‌యుడి లైఫ్ మిడ్‌క్యాప్ మొమెంటం ఇండెక్స్ ఫండ్, దాని 6-నెలల రీబ్యాలెన్సింగ్‌తో, బలహీనమైన వాటిని క్రమపద్ధతిలో తొలగిస్తూనే అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న స్టాక్‌లను హైలైట్ చేస్తుందన్నారు. ఈ రీబ్యాలెన్సింగ్ విధానం బలమైన రాబడిపై దృష్టి పెట్టడమే కాకుండా తక్కువ అస్థిరతను ప్రదర్శించే స్టాక్‌లకు రివార్డ్‌లను కూడా అందిస్తుందని చెప్పారు. ఈ ఫండ్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మొమెంటం 50 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తుందని, ఇది రెండు శక్తివంతమైన పెట్టుబడి వ్యూహాలను మిళితం చేస్తుందని చెప్పారు.

లీగ్ మ్యాచ్‌ల్లో ఎపి జట్ల సత్తా

ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, ఢిల్లీ జట్లు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కాలేజీ ఆవరణలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నమెంట్ ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్‌ఏపీ), కృష్ణాజిల్లా అండర్ - 19 విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి ఈ పోటీలు విజయవాడలో జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 26 జట్లు పోటీల్లో పాల్గొనగా, లీగ్ కమ్ నాకౌట్ విధానంలో మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. పోటీలలో భాగంగా మంగళవారం లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. లీగ్ మ్యాచ్‌ల కోసం ఆయా జట్లను 8 పూల్స్‌గా విభజించారు. లీగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్న జట్లలో ఆతిధ్య ఆంధ్రప్రదేశ్‌తో పాటు మధ్యప్రదేశ్, ఢిల్లీ, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర. తమిళనాడు, సిఐఎస్‌సిఇ జట్లు ఉన్నాయి. కాగా, ప్రీ క్వార్టర్ ఫైనల్, క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం ఉదయం నిర్వహించనున్నారు. ఆతిధ్య ఆంధ్రప్రదేశ్ జట్టు లీగ్ మ్యాచ్‌లలో తన సత్తా చాటుకుంది. ఆడిన రెండు మ్యాచ్‌లలనూ ఘన విజయాలను నమోదు చేసుకుని ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. హెచ్ - పూల్‌లో ఏపీతోపాటు మధ్యప్రదేశ్ జట్టు కూడా ప్రీ క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. మరో తెలుగు రాష్ట్రం తెలంగాణ మూడు మ్యాచ్‌లు ఆడగా, కేవలం ఒక్క మ్యాచ్‌లోనే విజయం సాధించి, రెండింటిలో ఓటమిని చవి చూసింది. ఎఫ్-పూల్‌లో కర్నాటక ఆడిన రెండు మ్యాచ్‌లలో గెలుపొందగా, ఒడిశా ఒక్క మ్యాచ్‌లో గెలుపొంది ప్రీ క్వార్టర్స్‌కు అర్హత పొందాయి.

రెండో రోజు ఫలితాలు : ఆంధ్రప్రదేశ్ జట్టు చండీఘడ్‌పై 25-12, 25-11, 25-13తో గెలుపు, హిమాచల్‌ప్రదేశ్ జట్టు పంజాబ్‌పై 18-25, 25-16, 23-25, 25-17, 17-15తో గెలుపు, ఉత్తరాఖండ్ జట్టు చండీఘడ్‌పై 25-15, 25-27, 18-25, పంజాబ్ జట్టు తెలంగాణపై 25-18, 25-15, 25-18 స్కోర్‌తోనూ, కర్నాటక జట్టు ఒడిశాపై 25-12, 25-13, 25-14తోనూ, తమిళనాడు జట్టు విద్యా భారతీ జట్టుపై 25-12, 25-3, 25-3తోనూ, మహారాష్ట్ర జట్టు రాజస్థాన్‌పై 23-25, 19-25, 25-20, 26-24, 15-12తోనూ, కేరళ జట్టు జమ్ము కాశ్మీర్‌పై 25-19, 25-13, 25-14తోనూ, గుజరాత్ జట్టు హర్యానపై 23-25, 25-19, 25-18, 25-17తోనూ, పశ్చిమ బెంగాల్ జట్టు ఢిల్లీపై 25-7, 25-11, 25-14 స్కోర్‌తోనూ గెలుపొందాయి.



బ్యాడ్మింటన్ విజేతకు అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో గల కెవికె ఇండోర్ స్టేడియంలో శాప్ కోచ్ కీసర గోపి వద్ద శిక్షణ పొందుతున్న జగ్గయ్యపేట పట్టణం 9వ వార్డు చింతలతోపునకు చెందిన నందిగామ జీవన్ ఈనెల 2వ తేదీ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర పారా బ్యాట్మెంటన్ సిఎం కప్ టోర్నమెంట్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. సుమారు 70 మంది పాల్గొనగా అందులో జీవన్ ప్రథమ స్థానం గోల్డ్ మెడల్‌ను అందుకున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్య జీవన్‌ను అభినందించి, శాలువాతో సన్మానించి, కప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ, సయ్యద్ అన్వర్, కౌన్సిలర్ పేరం సైదేశ్వర రావు, వల్లూరి వెంకటేశ్వర్లు, షేక్ గౌస్ భాష, షేక్ నూరుద్దీన్, దగ్గుపాటి శ్రీను, సూరా సతీష్ తదితరులు పాల్గొన్నారు.